




# కరపత్రం

SINCE 2014

మంగళవారం మే 20 2025 సంపుటి :0 సంచిక :217 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# రైతులకు సోలార్ పంపు సెట్లు..

## సోలార్ విద్యుత్ మిగిలితే ప్రభుత్వానికి అమ్ముకోవచ్చు:





మాచారం: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి ఇందిర సౌర గిరి జల వికాస పథకం ప్రారంభించారు. ఐదేండ్లలో రూ.12,600 కోట్లు ఖర్చు చేసి, ఆరు లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చి 2.10 లక్షల మంది చెంచులు, ఆదివాసీలు, గిరిజనులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని తీసుకొచ్చిందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చెప్పారు. అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆనాడు చెప్పానని, నిధులిచ్చే బాధ్యత తనదని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ప్రతీ మూలకు నీరందాలని ఆకాంక్షించారు.

మిగతా 2లో

- అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి ఇందిర సౌర గిరి జల వికాస పథకం ప్రారంభించారు. ఐదేండ్లలో రూ.12,600 కోట్లు ఖర్చు చేసి, ఆరు లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చి 2.10 లక్షల మంది చెంచులు, ఆదివాసీలు, గిరిజనులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని తీసుకొచ్చిందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చెప్పారు. అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆనాడు చెప్పానని, నిధులిచ్చే బాధ్యత తనదని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ప్రతీ మూలకు నీరందాలని ఆకాంక్షించారు.

## తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.




2లో

## తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఓఎంసీ కేసు దోషులు



2లో

NALLAMALA DECLARATION




## నల్లమల డిక్లరేషన్ తప్పకుండా అమలు చేస్తాం

- రూ.1000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చామని తెలిపారు.
- ప్రజలపై ప్రేమ ఉన్న ప్రభుత్వాలే ఇలాంటి పథకాలు అమలు చేయగలవని అన్నారు.
- ఇవి పథకాల ఆరంభం మాత్రమేనని, ఇంకా చేయాల్సింది చాలా ఉందని చెప్పారు.
- ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలను విమర్శించినట్లేనని అన్నారు.
- గత పదేళ్ళ పాలించిన ప్రభుత్వం ఒక్కసారైనా విద్య గురించి ఆలోచించిందా అని ప్రశ్నించారు.

మిగతా 2లో



## చెరిపేస్తే చెరిగిపోయేవి కావు..

కేసీఆర్ ఆనవాళ్ల అని రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం అయ్యిందేమో.. వేముల ప్రశాంత్ రెడ్డి సెటైర్లు



చెరిపేస్తే చెరిగిపోయేవి కావు కేసీఆర్ ఆనవాళ్లు అని రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం అయింది అనుకుంటా అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సెటైర్లు వేశారు. కేసీఆర్ కట్టిన అద్భుతమైన కట్టడాలు సెక్రటేరియట్ భవనాన్ని, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను , యాదాద్రి దేవాలయం,

2లో

## పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్.. గీత కూడా పడనివ్వని భారత ఆర్మీ

- ఆపరేషన్ సిందూర్ అనంతరం అక్కసుతో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకొని పాక్ డ్రోన్లు, క్షిపణలు ప్రయోగించగా.. భారత్ తిప్పికొట్టింది.




: ఆపరేషన్ సిందూర్ ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. మనదేశం మీదకు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత అక్కసుతో పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు.

2లో

## కాళేశ్వరం ఆనకట్టల విచారణ కమిషన్ గడువు పొడిగింపు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన న్యాయవిచారణ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.



2లో

## అందాల పోటీలే కాదు.. అగ్ని ప్రమాదాల మీదా దృష్టిపెట్టాలి: కేటీఆర్



2లో

## సిద్దిపేటలో ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యం

- పట్టణంలోని ఖాదర్‌పుర వీధిలో నివసించే ఓ కుటుంబంలోని ఐదుగురు అదృశ్యమయ్యారు.



2లో


కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం మే 20 2025

## ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత,,



**కరపత్రం ప్రతినిధి రుద్రంగి మే 19”**
రుద్రంగి మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ మరియు ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ప్రజావాణి సందర్భంగా తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,బస్టాండ్ ప్రాంతంలోని సర్వే నంబర్ 428/2/3/4 లో ఎకరం 32 గుంటల ప్రభుత్వ భూమి ఉందని అట్టి భూమిలో ప్రయివేట్ వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని వాటిని తొలగించాలని గతంలో హై కోర్టుకు వెళ్లడం జరిగిందని జిల్లా అధికారులు సర్వే చేసి అట్టి భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించారు.జిల్లా పంచాయితీ అధికారి అట్టి ప్రభుత్వ భూమి చుట్టూ హద్దు కంచె లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గతంలో ఉన్న తహశీల్దార్ కు ఉత్తర్వులు ఇచ్చారని కానీ గత ఎమ్మార్వో నిర్లక్ష్యం వహించి అట్టి భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదని అన్నారు.ప్రస్తుతం నూతన ఎమ్మార్వో ఇట్టి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ వినతిపత్రం అందజేసమని అన్నారు.అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకొని యెడల ఉన్నత న్యాయస్థానానికి వెళ్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం దయ్యాల కమలాకర్ గంగ మహేష్ చెప్పాల గణేష్ ఉప్పులూటి గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా హనుమాన్ శోభయాత్ర



**యైటింక్లయిన్ కాలనీ కరపత్రం ప్రతినిధి**
పట్టణములోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు సౌమిత్రి సుమంత్ చార్యులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి హనుమాన్ ఊరేగింపు సందర్భంగా హనుమాన్ చిత్రపటాన్ని వాహనంపై అలంకరించి టెంకాయ కొట్టి ఆలయం నుండి కాలనీ పురవీధుల గుండా మహిళలల కోలాటాల నడుమ శోభయాత్ర ఎంతో వైభవంగా జరిగింది. దీంతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై మే 20న నిరసన ప్రదర్శనలు నిర్వహించండి



### -ఐఎఫ్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పిలుపు

**యైటింక్లయిన్ కాలనీ కరపత్రం ప్రతినిధి**
లేబర్ కోడ్స్ రద్దు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల క్రమబద్దీ కరణ,బొగ్గుగనుల అమ్మకాలను రద్దుచేయాలని,ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణను నిలిపివేయాలని,నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్స్ విధానాన్ని అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తూ కనీస వేతనం అమలు చేయాలని, హమాలి, బీడీ, భవన నిర్మాణం,ఆటో అండ్ మోటార్ తదితర రంగంలో పనిచేస్తున్న సంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్లపై మే 20న జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఐఎఫ్ టి యు కార్మిక వర్గం పిలుపునిస్తుందన్నారు.అయితే మే 20న జరగవలసిన సమ్మె దేశంలో నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా సార్వత్రిక సమ్మెను వాయిదావేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయన్నారు. కానీ సరిహద్దులో కాల్పుల విరమణ చేస్తున్నట్లు ఇరు దేశాలు ప్రకటించిన నేపథ్యంలో దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొన్న స్థితిలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వాయిదా వేయటం సరికాదని ఐఎఫ్ టియు భావిస్తుందన్నారు. ఒకవేళ వాయిదా వేయవలసి వస్తే కేంద్ర కార్మిక సంఘాలు మే 9న ఢిల్లీలో సమావేశమైన సందర్భంలోనే నాటి నిర్దిష్ట పరిస్థితులలో ఈ నిర్ణయం తీసుకుని ఉంటే కార్మికులకు వాయిదా విషయాల్ని అర్థం చేయించడానికి అవకాశం ఉండేదని, దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం జరిగి, కార్మిక వర్గం సమ్మెకు సన్నద్ధమై ఉన్న తరుణంలో ఆకస్మాత్తుగా సమ్మెను వాయిదా వేయడం వలన కార్మికుల్లో నిరాశ నిస్పృహ చోటు చేసుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన ఈ ఉమ్మడి పిలుపులో మా సంస్థ కూడా భాగస్వామిగా ఉన్నందున మే 20న జరగవలసిన సార్వత్రిక సమ్మెను జులై 9 కి వాయిదా వేస్తూ చేసిన నిర్ణయానికి కట్టుబడి మే 20న జరగవలసిన నిరసన ప్రదర్శనల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని అన్ని జిల్లాల్లో మా సంస్థ చురుకైన పాత్ర పోషిస్తుందని తెలియజేస్తూ రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు నిరసన కార్యక్రమాలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఐఎఫ్ టియు పెద్దపల్లి జిల్లా కమిటీ కార్మికులను కోరారు.

## చెరిపేస్తే చెరిగిపోయేవి కావు..

మొదటిపేజీ తరువాయి
నాగార్జున సాగర్ బుద్ధవనం చూసి ప్రపంచ సుందరీమణులు సంబరంతో ఆశ్చర్య పోయి, సెల్ఫీలు తీసుకున్న విషయాన్ని తెలిపారు. అమరుల స్మారక జ్యోతి,125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం,T హబ్ లను కూడా ప్రపంచ సుందరీమణులకు చూపించాలని సూచించారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం ఎవరితరం కాదు.. కేసీఆర్ అంటేనే తెలంగాణ..తెలంగాణ అంటేనే కేసీఆర్ అని స్పష్టం చేశారు. దిగజారుడు విమర్శలు, పిచ్చి ప్రేలాపనలు మాని..ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలు, పరిపాలనపై దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు.
ప్రపంచం గర్వించదగ్గ నిర్మాణాలు చేపట్టడం కేసీఆర్కే సాధ్యమని, KCR ఆనవాళ్లను చెరిపేస్తా అని చెప్పిన వాళ్లు, ఇప్పుడు ఆ ఆనవాళ్ళనే ప్రపంచానికి చూపించుకునే పరిస్థితి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. “కేసీఆర్ హయాంలో నిర్మించిన అంబేద్కర్ సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, యాదాద్రి దేవాలయం, నాగార్జున సాగర్ బుద్ధవనం తెలంగాణకు తలమాణికాలు అని కొనియాడారు. అవి గొప్ప నిర్మాణాలని, చెరిపేస్తే చెరిగిపోవడానికి మట్టి రాతలు కాదని.. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం శాశ్వతంగా నిలిచిపోయే కేసీఆర్ ఆనవాళ్లు అని స్పష్టం చేశారు.
మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన పోటీదారుల ద్వారా తెలంగాణ గొప్పదనం ప్రపంచానికి తెలిసేలా చేయడానికి కేటీఆర్ కట్టించిన సెక్రటేరియట్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, యాదాద్రి దేవాలయం, నాగార్జున సాగర్ బుద్ధవనం వంటి నిర్మాణాలు అలాగే రాచరిక పోకడలు అని మాట్లాడి తెలంగాణ చిహ్నం నుంచి తొలగించాలని అనుకున్న చార్మినార్, కాకతీయ కళా వైభవాలే ఈ ప్రభుత్వానికి దిక్కు అయ్యాయని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అమరుల త్యాగం తెలంగాణ ప్రజల గుండెల్లో నిరంతరం జ్వలించేలా కేసీఆర్ కట్టించిన అమరుల స్మారక జ్యోతి చిహ్నం, బడుగు బలహీన వర్గాల కోసం పని చేయాలని పాలకుల్లో స్ఫూర్తిని నింపే విధంగా కేసీఆర్ కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని కూడా మిస్ వరల్డ్ పోటీదారులకు చూపిస్తే తెలంగాణ చరిత్ర, అమరుల త్యాగం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గొప్పతనం విశ్వవ్యాప్తమవుతుందని సూచించారు.
తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ అని.. వాటిని చెరిపేయాలని అనుకోవడం రేవంత్ రెడ్డి మూర?త్వమే అవుతుంది అని వేముల ప్రశాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. గత పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలో అగ్రగామిగా నిలిస్తే.. రేవంత్ రెడ్డి అవగాహన లేని పరిపాలన తో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో రోజురోజుకు దిగజారుతున్నదదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ధాన్యం కొనేవారు లేక, అకాల వర్షాలకు తడిచిన ధాన్యం అమ్ముకోలేక బాధతో కల్లాల మీద రైతులు ప్రాణాలు వదులుతుంటే జీతాలు సరిగ్గా రాక చిన్న ఉద్యోగులు తమ నిత్య నిరసనలు తెలియజేస్తుంటే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల (గుల్జార్ హౌజ్ లో అగ్ని ప్రమాదం)అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే, రాష్ట్రంలో విచ్చల విడిగా క్రైమ్ రేట్ పెరిగిపోతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా అంత బాగున్నట్టు మిస్ వరల్డ్ పోటీల నిర్వహణలో మునిగి తేలుతున్నాడు అని ఎద్దేవా చేశారు.
రాష్ట్రం దివాళా తీసింది, ఎక్కడా అప్పు పుట్టడం లేదు, కేంద్రంలో నన్ను చెప్పులు ఎత్తుకు పోయేవాడి లాగా చూస్తున్నారు అని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నడని.. అలాంటప్పుడు అందాల పోటీల పేరుతో వందల కోట్ల దుబారా ఖర్చు ఎందుకు చేస్తున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తారని అన్నారు. నీ పరిపాలనతో విసుగు చెందుతున్న ప్రజలే.. నీ రాజకీయ ఆనవాళ్లు తెలంగాణ నుంచి శాశ్వతంగా చెరిపేస్తారని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు.

## సిద్దిపేటలో ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యం

మొదటిపేజీ తరువాయి
సిద్దిపేట పట్టణం: పట్టణంలోని ఖాదర్పుర వీధిలో నివసించే ఓ కుటుంబంలోని ఐదుగురు అదృశ్యమయ్యారు. శనివారం ఉదయం నుంచి వారు కనిపించట్లేదు. ఫోన్లను ఇంట్లోనే వదిలేసి వెళ్లారు. స్థానికులు, బంధువులు ఏదైనా ఊరికి వెళ్లారని అనుకొని ఊరుకున్నారు. కానీ, రెండ్రోజులైనా వారి జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరబత్తిని బాలకిషన్కు అప్పులు ఉన్నాయని, తనకు డబ్బులు ఇచ్చేవారు ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు లేఖ రాసి పెట్టారని బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకిషన్ తండ్రి జనార్దన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీష కనిపించట్లేదని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వారి ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ మధు తెలిపారు.

## పాక్ టార్గెట్లో గోల్డెన్ టెంపుల్.. గీత కూడా పడనివ్వని భారత ఆర్మీ

మొదటిపేజీ తరువాయి
వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని తెలిపారు
%మన ఆపరేషన్ తర్వాత పాక్ దాడులకు పాల్పడుతుందని భారత సైన్యం అంచనా వేసింది. మిలిటరీ టార్గెట్లతో పాటు పౌరులకు చెందిన సదుపాయాలు, మతపరమైన ప్రాంతాలపై రెచ్చగొట్టే చర్యలు ఉండొచ్చని ఊహించింది. “పాక్కు ఎలాంటి కచ్చితమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి. ముందుగానే ఊహించడంతో దానికి అదనపు రక్షణ కల్పించాం. పూర్తిగా సిద్ధమయ్యాం. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు” అని మేజర్ జనరల్ వెల్లడించారు.
‘నేను ఏడీ గన్.. శత్రువు కనిపిస్తే లేపేస్తా’.. వీడియో పోస్టు చేసిన ఇండియన్ ఆర్మీ
‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో భారత సైన్యం పాక్లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. దాంతో వందలాదిగా పాక్ డ్రోన్స్, మిసైల్స్ను భారత్పై ప్రయోగించింది. మన ఎస్-400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయి. వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దానికి సంబంధించిన వీడియోను వెస్టర్న్ కమాండ్ పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడిన వీడియోలు పెద్దఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే.

## అందాల పోటీలే కాదు.. అగ్ని ప్రమాదాల మీదా దృష్టిపెట్టాలి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాల్లో మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. చార్మినార్ పరిధి గుల్జార్హౌజ్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని ఆయన పరిశీలించారు. తాను రాజకీయంగా మాట్లాడటానికి ఇక్కడికి రాలేదని చెప్పారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు.
“రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం కాదు.. ప్రాణాలపై దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబసభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలి. ముఖ్యమంత్రే హోంమంత్రి కాబట్టి ఘటనా స్థలానికి వస్తే అధికారులు ఇంకా బాగా పనిచేస్తారు. వేసవి కాలం వచ్చే ముందు అగ్నిమాపక సిబ్బందితో ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి.. కానీ నీళ్లు లేవు. సిబ్బందికి సరైన మాస్కులు లేవని తెలిసింది. అంబులెన్స్లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరం. హైదరాబాద్లో ఇదే అత్యంత భారీ అగ్ని ప్రమాదం. నిన్నటిరోజు దుర్భరమైన రోజు.. బాధితులు, మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతం” అని కేటీఆర్ తెలిపారు.

## రైతులకు సోలార్ పంపు సెట్లు..

మొదటిపేజీ తరువాయి
గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా చేస్తున్నామని, ఇందిరా సౌర గిరి జల పథకంతో మీ బతుకుల్లో మార్పు తెస్తామని సభకు హాజరైన గిరిజనులకు సీఎం రేవంత్ మాట ఇచ్చారు. ‘ఇందిర సౌర గిరి జల వికాసం’ పథకం ద్వారా 6.69 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకురావడమే లక్ష్యమని సీఎం రేవంత్ చెప్పారు. పొలాల్లో సోలార్ పంపుసెట్లతో మీకు ఆదాయం వస్తుందని, సోలార్ విద్యుత్ మిగిలితే ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి రైతులకు వివరించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు సోలార్ పంపు సెట్లు అందజేస్తామని, 100 రోజుల్లో అచ్చంపేటలో సోలార్ పంపుసెట్లు రైతులకు ఇస్తామని సీఎం రేవంత్ చెప్పారు.
సోలార్ పంపుసెట్లలో అచ్చంపేటను దేశానికే ఆదర్శంగా మారుస్తామని సీఎం చెప్పారు. చెంచులందరికీ 10 రోజుల్లో ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసరాల ధరలు తగ్గించడంలో తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రం చెప్పిందని, శాంతి భద్రతల్లో కూడా మనమే నంబర్ వన్లోనే ఉన్నామని సీఎం హర్షం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం 60 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని -సీఎం రేవంత్రెడ్డి చెప్పారు. ఆడ బిడ్డలను పెట్రోల్ బంకుల యజమానులను చేశామని, రాబోయే రోజుల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతొ పనిచేద్దామని సీఎం రేవంత్రెడ్డి పిలుపునిచ్చారు.

## తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్పేట్, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.
చురుగ్గా నైరుతి రుతుపవనాలు
బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.
మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఓఎంసీ కేసు దోషులు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ఓబులాపురం మైనింగ్ (ఓఎంసీ) కేసులో దోషులుగా ఉన్న నలుగురు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి, బీబీ శ్రీనివాస్రెడ్డి, రాజగోపాల్, అలీ ఖాన్ పిటిషన్లు దాఖలు చేశారు. తమను దోషులుగా తేల్చేందుకు సరైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఇప్పటికే మూడున్నరేళ్లపాటు జైల్లో ఉన్నామని తెలిపారు. విచారణ సందర్భంగా గతంలో బెయిల్ మంజూరు చేసినప్పుడు ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదన్నారు. ఇప్పుడు బెయిల్ మంజూరు చేసినా నిబంధనలకు లోబడి ఉంటామని పిటిషనర్లు పేర్కొన్నారు.
ఓఎంసీ కేసులో ఈనెల 6న నాంపల్లిలోని సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. గాలి జనార్దనరెడ్డితో పాటు బీవీ శ్రీనివాస్రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్ను దోషులుగా తేల్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారంతా చంచల్గూడ జైల్లో ఉన్నారు.

## నల్లమల డిక్లరేషన్ తప్పకుండా అమలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి
నల్లమల డిక్లరేషన్ ను తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. నాగర్ కర్నూల్ లో ఇందిరా సౌరగిరి జలవికాస పథకం ప్రారంభం సందర్భంగా మాట్లాడిన భట్టి..నల్లమల డిక్లరేషన్ నాలుగేండ్లు అమలు చేసి తీరుతామని చెప్పారు. దీని వల్ల గిరిజన కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నల్లమల డిక్లరేషన్ ఫలితాలు ప్రజలకు చూపిస్తామన్నారు. తాము కల్లారా చూసిన సమస్యలే ఈ నల్లమల డిక్లరేషన్ అని అన్నారు.
సభలో మాట్లాడిన భట్టి. .12వేల 600 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాస పథకం తెచ్చాం.. దేశంలోనే గర్వించ దగ్గ గొప్ప కార్యక్రమం. గతంలో అడవి భూములపై గిరిజనులకు హక్కులు లేవు
రాష్ట్రంలోని గిరిజన కుటుంబాలకు ఇది శుభదినం. భూమి కోసం,భుక్తికోసం దశాబ్ధాలుగా కొనసాగిన పోరాటం ఇది. గిరిజన కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. సంపద సృష్టిస్తాం..ప్రజలకు పంచుతాం. రూ.1000కోట్లతో రాజీవ్ యువ వికాసం తీసుకొచ్చాం. ఈపథకాలు మామూలు ప్రభుత్వాలు చేయలేవు. ప్రజలపై ప్రేమ ఉన్న ప్రభుత్వాలకే ఇది సాధ్యం. ఈపథకాలు ఆరంభం మాత్రమే..ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలను విమర్శించినట్లే. పదేళ్లు పాలించిన పార్టీ ఒక్కసారైనా విద్యగురించి ఆలోచించిందా.? అని అన్నారు.

## కాళేశ్వరం ఆనకట్టల విచారణ కమిషన్ గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మరో రెండు నెలలపాటు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెలాఖరు వరకు గడువు పెంచుతున్నట్లు పేర్కొంది. ఇటీవల ఈ కమిషన్ విచారణను పూర్తి చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను అందించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.


# రాయితీ పైన జీలుగు విత్తనాల పంపిణీ

గాజెంగి మహేశ్వర్, మెట్ పల్లి కరపత్రం ప్రతినిధి

జగిత్యాల జిల్లా ఇబ్రాహీంపట్నం మండలలోని యామాపూర్, ఇబ్రహింపట్నం సహకార సంఘం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం లలో సోమవారం 50% రాయితీ పైన జీలుగు విత్తనాల పంపిణీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎఓ రాజ్ కుమార్ మాట్లాడుతూ,డిసిఎంఎస్ దబ్బా, గోదూర్ కేంద్రాలలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావలిసిన రైతులు పట్టా పాస్ బుక్ , ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని తమ తమ ఎఇఓ వద్ద పర్మిట్ పొంది జీలుగు విత్తనాలు తీసుకోవాలని 30 కేజీ జిలుగు బస్తా ఒక్కంటికి రూ.4174 చొప్పున సబ్సిడీ తో రైతు చెల్లించాల్సిన ధర నుండి రూ. 2137 మాత్రమే చెల్లించాలన్నారు.ఒక బస్తా రెండున్నర ఎకరాలకు


ఇబ్రహీంపట్నం లో జీలుగు పంపిణీ చేస్తున్న దృశ్యం

సరిపోతుందని ఎఓ సుచించారు.
పంపిణీ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, సహకారసంఘం చైర్మన్ లు అంకతి రాజన్న,బద్దం గోపి, మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్,



యామాపూర్ లో జీలుగు పంపిణీ దృశ్యం

ఎఇఓలు వినోద్, సాగర్, రవళిక , సాయికృప,నాయకులు గూడ శ్రీకాంత్, పల్లె నాగేష్, సిఇఓలు మంత్రి సతీష్, నేమురి మహేంధర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలి



ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి

ప్రైవేట్ విద్యా సంస్థల యజమానులు తమకు సంబందించిన బస్ లకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని రవాణా శాఖ జిల్లా అధికారి భద్రు నాయక్ అన్నారు. ఆర్.టీ.వో కోరుట్ల యూనిట్ పరిధిలోని కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్, మెట్ పెల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల ప్రవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ వాహనాల ఫిట్నెస్, పర్మిట్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, టాక్స్ సర్టిఫికెట్లను కలిగి ఉండాలన్నారు. స్కూల్ బస్ డ్రైవర్ హెవీ లైసెన్స్ కలిగి ఉండి, కనీసం 5సంవత్సరాలు అనేభవం కలిగి ఉండాలన్నారు. 60సంవత్సరాలు పైబడిన వారిని డ్రైవర్లుగా తీసుకోకూడదని, బస్ లో ఎమర్జెన్సీ ఫస్ట్ అండ్ కిడ్స్, ఫైర్ ఎగ్జిట్స్ తప్పక ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ వాహనాల పట్ల యాజన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కోరుట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ గిరీష్, వజ్ర ,రవాణా శాఖ సిబ్బంది, ఆయా పాఠశాల యాజమానూలు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం







- ఆలయంలో హరహర మహదేవుని పున:ప్రతిష్ఠ
- గాజెంగి మహేశ్వర్, మెట్ పల్లి కరపత్రం ప్రతినిధి
- యజ్ఞ పూర్ణాహుతి చేసిన అర్చకులు

ఆలయకమిటి అధ్వర్యంలో అన్నప్రసాదం
ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

జగిత్యాల జిల్లా ఇబ్రాహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలోని అతి పురాతన హరహర మహదేవుని ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం జరిగింది.
చౌట్ పల్లి వాస్తవ్యులు కప్పగంతుల గంగా ప్రసాద్ దీక్షిత్ గారి కర కమమలములచే ఘనంగా జరిగింది. పాలరేవు గోదావరి నదీ తీరంలోని మహదేవుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ గర్భగుడి ముందు నూతన మండపం, ఆలయం లో అన్నపూర్ణ దేవి మాత నూతన విగ్రహం , ఏకశిల ద్వజస్థంబ పున ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆడంబరంగా నిర్వహించారు.
ఆలయప్రాగణ లో యజ్ఞ పూర్ణహుతి చేశారు. అనంతరం స్వామి వారి మండపంలో కల్యాణం నిర్వహించారు. ఆలయకమిటి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.
భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మంత్రరాజం



శ్రీనివాసాచార్యులు, మంత్ర రాజం జానకీ రామకృష్ణ చార్యులు, మంత్రరాజం అరవింద్ కృష్ణాచార్యులు, గణేష్ శర్మ, ఆలయ అభివృద్ధి దాతలు, దేవాలయకమిటీ, అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాను

– జీఎస్టీ కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ను కలసిన ఫిర్యాదుల పరిష్కార కమిటీ సభ్యులు

మంథని, కరపత్రం ప్రతినిధి





తెలంగాణలో జీఎస్టీకి సంబంధించిన ఫిర్యాదుల మరియు కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్ (ఐ ఆర్ ఎస్ ) మర్యాదపూర్వకంగా కలిశారు. పరిష్కార కమిటీ సభ్యులు తెలంగాణ జిఎస్టి ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న తెలంగాణ జీఎస్టీ మరియు కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీ సందీప్ ప్రకాష్ (ఐఆరెస్) బషీర్ బాగ్ జీఎస్టీ భవనంలో పరోక్ష పన్ను నిపుణులు సి ఏ మొహమ్మద్ ఇర్షాద్, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు హితేష్ జైన్, ఏ ఐ ఎఫ్ టి పి తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ ( సౌత్ జోన్ ) అడ్వకేట్ నగేష్ రంగి, సిఏ హరికిషన్, సి ఎం ఏ మల్లికార్జున గుప్తా, రామచంద్ర కులకర్ణి మరియు అనిల్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందీప్ ప్రకాష్ ఐఆరెస్ సేవలను మరియు వాణిజ్య మరియు పరిశ్రమల ఫిర్యాదులను పరిష్కరించడంలో ఆయన నిరంతర మద్దతును ప్రశంసించారు. ప్రతి సంవత్సరం మూడు నెలలకు ఒకసారి జిఎస్టి కి సంబంధించిన పరోక్ష పన్నుల విషయంలో కమిషనర్ తో చర్చించడం ఒక సంప్రదాయం.

# వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలి

– ఇబ్రాహింపట్నం మండల విద్యాధికారి బండారి మధు

గాజెంగి మహేశ్వర్, మెట్ పల్లి కరపత్రం ప్రతినిధి

వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల బండారి మధు అన్నారు.సోమవారం ఎంఇఓ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం నుండి 24 వరకు జరిగే ఐదు రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి


ఉపాధ్యాయులతో ఎంఆర్ సి లో మాట్లాడుతున్న ఎంఇఓ మదు

మండలంలో గల అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి వచ్చే ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠ్యపుస్తకాలు మరియు పాఠ్యప్రణాళిక పుస్తకాలు వెంట తీసుకొని రావలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం హాజరు విషయంలో ఎవరికి ఎటువంటి మినహాయింపు ఉండదని తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్య అభివృద్ధి పొందడంతోపాటు విద్యార్థులలో భాషా మరియు గణిత సంబంధిత మౌలిక అభ్యసన సామర్థ్యాల పెంపునకు తోడ్పడుతుందని ఎంఇఓ తెలియజేశారు.

# జిలుగు విత్తనాల పంపిణీ

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి



మండలంలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ అధికారులు జిలుగు విత్తనాలను రైతులకు సబ్సిడీ పై సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్బంగా అధికారులు మట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లతో రైతులు డీసీఎంఎస్ కేంద్రానికి వచ్చి ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగు విత్తనాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు నరేష్, ఫామీన, ఏఎంసి డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి సరస్వతీ నది పుణ్య స్నానాలు

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా దక్షిణ కాశి కాళేశ్వరం లో సరస్వతి పుష్కరాలు సందర్బంగా త్రివేణి సంఘమం లో పుణ్య స్నానాలు ఆచరించడం జరిగింది.తదనంతరం కాళేశ్వరం శ్రీ ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శనం చేసుకోవడం జరిగింది.తదనంతరం ఆలయ పురోహితులచే ఆశీర్వచనాలు స్వీకరించడం జరిగింది.మల్లారెడ్డి తో పాటు మేడ్చల్ బిఆర్ఎస్



నాయకులు శ్రీ భాస్కర్ యాదవ్ మరియు ఇతరులు



పాల్గొన్నారు.

# టీడీపీ కి గత వైభవం

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రజల సంక్షేమనికి చేపట్టిన అభివృద్ధి పనులే ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ కి గత వైభవాన్ని తీసుకొస్తుందని ఆ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మండలాల్లోని ఆయా ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యత్వ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్బంగా అయన మట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు మరియు బీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లను కల్పించిన ఘనత టిడిపిదే అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలే మారుతి, కటుకం మహదేవ్, ఈర్నాల గంగులు, నరహరి, మహిళా నాయకురాలు దివ్య, జ్యోతి, విజయ, పద్మ, మాలశ్రీ, శాంత, అంజలీ, కళ్యాణి ,సోనీ ,రాణి, చంద్రకళ, లీల ,రాధా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల మొబైల్ నెంబర్లలో మార్పులు...

బెజ్జంకి కరపత్రం ప్రతినిధి

బెజ్జంకి మండల విద్యుత్ అధికారుల, సిబ్బంది మరియు సబ్ స్టేషన్ల పాత ఫోన్ నంబర్లు తొలగించి కొత్త నంబర్ల ను కేటాయించడం జరిగిందని బెజ్జంకి ట్రాన్స్కో ఏ ఈ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పాత నెంబర్లు కాకుండా సిబ్బందికి కొత్తగా కేటాయించిన నంబర్లకు ఫోన్ చేసి సేవల పొందాలని మహేష్ కోరారు. కొత్తగా కేటాయించిన నంబర్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి.
ఏడీఈ/బెజ్జంకి - 8712471358
ఏ ఈ/బెజ్జంకి - 8712471339
ఏ ఈ/తోటపల్లి - 8712471338



లైన్ ఇన్ స్పెక్టర్/బెజ్జంకి - 8712471314
లైన్ మెన్/ బెజ్జంకి - 8712471316
లైన్ ఇన్ స్పెక్టర్/తోటపల్లి - 8712471349
లైన్ మెన్/తోటపల్లి - 8712471319
లైన్ మెన్/ బేగంపేట - 8712471320
33/11KV సబ్ స్టేషన్
బెజ్జంకి - 8712471381
కల్లేపల్లి - 8712471369
గుగ్గిళ్ళ - 8712471367
రేగులపల్లి - 8712471368
తోటపల్లి - 8712471380
బేగంపేట - 8712471371
దాచారం - 8712471385
వడ్లూర్ - 8712471386 వినియోగదారులు నెంబర్లను నోట్ చేసుకుని సేవలు పొందాలని ఏ ఈ వినియోధాలను కోరారు.

# మే 22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు...

**కోరుట్ల, మెట్టుపల్లి, జగిత్యాల్ వార్తలకు ...**
ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ (2024-25 విద్యా సంవత్సరం) పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. మే 22వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.పరీక్షల నిర్వహణ కోసం సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్ లు,డిపార్ట్ మెంటల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లా కలెక్టర్,అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇదివరకే అన్ని విభాగాల అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించమన్నారు.ప్రతి పరీక్షా కేంద్రంలో సీ.సీ.కెమెరాల నిఘాలోనే పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు.చీఫ్ సూపరింటెండెంట్ లు,డిపార్ట్మెంటల్ అధికారులు కచ్చితంగా నియమ నిబంధనలను పాటిస్తూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు.ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు,మధ్యాహ్నం రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని అన్నారు.రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో 36



సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా మంచినీటి వసతి, మరుగుదొడ్లు, వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య సేవలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రంలో కేటాయించిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఫర్నిచర్ ను సమకూర్చుకోవాలని,అలాగే ప్రతి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ లను నియమించి వారికి శిక్షణ ఇచ్చే బాధ్యత సీఎస్,డీవో లదే అన్నారు. కాపీయింగ్ జరగకుండా పరీక్ష ప్రారంభం కు ముందుగానే విద్యార్థులను తనిఖీ చేసి పంపాలన్నారు.విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్ సైట్ అప్ లోడ్ చేశామన్నారు.ప్రైవేటు జూనియర్ కళాశాల ల



ప్రిన్సిపాల్ లు హాల్ టికెట్ లు ఇవ్వకపోయినా విద్యార్థులు డౌన్లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావచ్చని స్పష్టం చేశారు.విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా వెంటనే హాల్ టికెట్లు అందరికీ ఇవ్వాలని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లను ఆదేశించారు.పరీక్షా కేంద్రంలోకి హాల్ టికెట్ పైన ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా,స్టాంపు లేకపోయినా సీఎస్, డీవోలు వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు.అనంతరం జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, కనకమహాలక్ష్మీ, బాలుర ఖిల్లా కళాశాల ప్రిన్సిపాల్ కాలిక్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ కు ముందు,పరీక్షలు జరుగుతున్నపుడు,పరీక్ష పూర్తైన తర్వాత చేపట్టాల్సిన చర్యలను క్షుణ్ణంగా వివరించారు.సమావేశంలో 36 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు,డిపార్ట్ మెంటల్ అధికారులు,కస్టోడియన్లు,అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లు,తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్ షిప్ లు విడుదల చేయాలి



**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్ టౌన్,మే 19 :**
ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజులు పెంచడాన్నినిరసిస్తూ,స్కాలర్ షిప్ లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు సోమవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తోందని,ఇప్పటికే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు రాక ఎంతో మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు.అయినప్పటికీ ఇంకా ఫీజులను పెంచుతూ పేద విద్యార్థులను చదువుకు దూరం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ సునీల్, నగర కార్యదర్శి బాలకృష్ణ,యోగేశ్,సిద్దు,హేమంత్,రంజిత్, దుర్గాదాస్,రాజకుమార్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అహల్యా బాయి ఆదర్శప్రాయ నాయకురాలు

- యుద్ధ విద్యలలో స్త్రీలను ప్రోత్సహించి మహిళా సేనను ఏర్పరిచారు...
- దినేష్ కులచారి జిల్లా బిజెపి అధ్యక్షుడు...

**కోరుట్ల, మెట్టుపల్లి, జగిత్యాల్ వార్తలకు ...**
బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో మహారాణి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలలో భాగంగా ఘనంగా నిర్వహించిన కార్యశాలకు జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి మహిళా మోర్చ రాష్ట్ర నాయకురాలు విజయ భవానీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ మాట్లాడుతూ,అహల్యాబాయి హోల్కర్ శివ భక్తురాలిగా పేరుగాంచారనీ అన్నారు.ఆమె మధ్య



భారత మాళ్వా ప్రాంతానికే కాకుండా దేశ వ్యాప్తంగా అనేక శివాలయాలను నిర్మించార నీ పేర్కొన్నారు. మహమ్మదీయుల దాడుల్లో శిథిలమైన ఆలయాలను పునర్నిర్మించి, హిందూ ధర్మ పునరుత్తేజానికి కృషి చేశారు
అన్నారు.కాశీ,ద్వారకా,మథురా,ఉజ్జయిని,రామేశ్వరం,అయోధ్య, హరిద్వార్,ఘృష్ణేశ్వర్ వంటి అనేక పవిత్ర ప్రాంతాలలో ఆలయాలను పునరుద్ధరించడం ద్వారా ఆమె భక్తి పరాయణతను చాటారని పేర్కొన్నారు. అహల్యా బాయి యుద్ధ విద్యలలో మహిళలను ప్రోత్సహించి ప్రత్యేకంగా మహిళా సేనను ఏర్పాటుచేశారు అన్నారు. వితంతువులకు భర్త ఆస్తి సంక్రమించేలా చట్టాలను అమలు చేశారనీ, వ్యవసాయ అభివృద్ధి కోసం కాలువలు, చెరువులు త్రవ్వించి గ్రామీణాభివృద్ధికి పాటుపడ్డారు అని అన్నారు.ప్రజలకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలను స్థాపించారని, ఆమె స్థాపించిన మహేశ్వర్ వస్త్ర పరిశ్రమ నేటికీ నిర్విరామంగా కొనసాగుతోందని వివరించారు. ఆమె సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పురస్కారం ను ఆమె పేరుతో ప్రస్థావించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొతన్ కార్ లక్ష్మి నారాయణ, పంచ రెడ్డి ప్రవళిక, పద్మ రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జగదాంబ ఆలయాల వార్షికోత్సవం



**కరపత్రం ప్రతినిధి ఏర్గట్ల,మే 19 :**
ఏర్గట్ల మండలంలోని భట్టాపూర్ గిరిజన తాండ లో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాత ఆలయాలు నిర్మించి నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో సోమవారం గిరిజనులు ఆలయ నాలుగవ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బంజారా సంఘ సభ్యులు మాట్లాడుతూ,తమ బంజారుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జగదంబ మాత ఆలయాలు నిర్మించుకున్నామని ప్రతి సంవత్సరం ఆలయం ముందర భోగ బండార్,ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి ప్రజలు సుఖసంతోశాలతో ఉండాలని,పాడిపంటలు బాగుండాలని,వేడుకుంటామని అన్నారు ప్రతి ఒక్కరు సేవాలాల్ మహారాజ్ అడుగుజాడ నడవాలని శాంతితో ఉండాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బంజర సంఘ సభ్యులు,గ్రామస్తులు,భక్తులు,తదితరులు,పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం పేరుతో మోసం

**కోరుట్ల, మెట్టుపల్లి, జగిత్యాల్ వార్తలకు ...**
ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుంచి మలావత్ మోహన్ అనే వ్యక్తి రూ.9లక్షలు వసూలు చేశాడని తేజావత్ పీరు అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.నిజామాబాద్ రూరల్ మండలం లింగితండాకు చెందిన తేజావత్ పీరును తన బంధువైన సిరికొండ మండలం చీమన్ పల్లికి చెందిన మలావత్ మోహన్ తాను చాలా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించానని,నీకు కూడా ప్రభుత్వ ఉద్యోగం (పోస్ట్ ఆఫీస్ లో) ఇప్పిస్తానని మాయమాటలు చెప్పాడు. మోహన్ మాటలను నమ్మిన పీరు విడతల వారీగా రూ.4లక్షలు అతడికి చెల్లించింది.వీటిలో రూ.3లక్షలు తన భర్త ఫోన్ పే నుంచి చెల్లించగా, మిగతా లక్ష రూపాయలు నగదు ఇచ్చింది. డబ్బులు తీసుకున్న



మోహన్ రేపుమాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు.తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని లేదా తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలని పీరు ఒత్తిడి చేయడంతో పోస్టాఫీస్ లో ఉద్యోగం వచ్చిందని ఒక నకిలీ అపాయింట్ మెంట్ ఆర్డర్ ఇచ్చాడు. అది ఫేక్ అని తేలడంతో పీరు మోహన్ ను నిలదీయగా,ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని, కోర్టులో జాబ్ ఇప్పిస్తానని మళ్లీ నమ్మించి రూ.5లక్షలు వసూలు చేశాడు. కోర్టులో జాబ్ వచ్చిందని చెప్పి,జిల్లా జడ్జి సంతకం ఫోర్జరీ తో అపాయింట్ మెంట్ ఆర్డర్ కాపీని ఇచ్చాడని పీరు ఆవేదన వ్యక్తం చేసింది. మలావత్ మోహన్ ఉద్యోగం పేరుతో తనను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేశాడని,వెంటనే అతడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితురాలు పీరు కోరుతోంది.

# మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కుమార్తె వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యేలు



**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ మే 19**
బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్లో సోమవారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జూబేర్ కుమార్తె వివాహానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంతు షిండే, గంప గోవర్ధన్ వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముజీబుద్దిన్, నాయకులు దఫెదర్ రాజు, సాయిబాబా, మోచి గణేష్, బోడ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో తిరంగ ర్యాలీ

- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...

**కోరుట్ల, మెట్టుపల్లి, జగిత్యాల్ వార్తలకు ...**
పహల్గామ్ దాడితో భారతీయుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదుల ఖరా?నా అయిన పాకిస్తాన్ పై ఆపరేషన్ సింధూర్ పేరిట జరిపిన దాడికి యావత్ భారతదేశం వారి వెంట ఉందని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు.ఆపరేషన్ సిందూర్ విజయం" త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా సిటిజెన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఇందూరు జిల్లా ఆధ్వర్యంలో మేము సైతం దేశం కోసం అనే నినాదంతో సోమవారం సాయంత్రం నిజామాబాద్ నగరంలోని శివాజి చౌక్ ఆర్.ఆర్.చౌరస్తా వద్ద తిరంగా యాత్ర జరిగింది.ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ,సైనికులకు ఇందూరు ప్రజలు మేము సైతం వెంట ఉంటామని ప్రకటించడం గర్వంగా ఉందన్నారు.ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల ప్రాణాలను తీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులకు మన సైనికులు తగిన గుణపాఠం




చెప్పారన్నారు.భరతమాత వేషధారణలో సైనికుల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదేవిధంగా భారీ భరతమాత విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ,పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి,మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి,నాయకులు కృపాకర్ రెడ్డి,రాజ్ కుమార్ సుబేదార్,మాజీ కార్పొరేటర్లు,యువత,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర సాఫ్ట్ బాల్ పోటీలకు తొర్లికొండ క్రీడాకారులు

**కరపత్రం ప్రతినిధి నిజామాబాద్ స్పోర్ట్స్,మే 19 :**
జెడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ ఆర్మూర్ క్రీడ మైదానంలో జరిగిన జూనియర్ సాఫ్ట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక లో తొర్లికొండ గ్రామ క్రీడాకారులు భానోత్ రాజు,సింగారం నాగసూర్య, కొయ్యల విగ్నేష్ తాళ్ల సిద్ధార్థ లు పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి ఈనెల 19 నుండి 21 వరకు టీజీఆర్ఎస్ తూప్రాన్ పాఠశాల క్రీడామైదానం,మెదక్ జిల్లాలో 11వ రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు.రాష్ట్ర పోటీలలో పాల్గొంటున్న తొర్లికొండ గ్రామ క్రీడాకారులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారి మూడెడ్ల శ్రీనివాస్,తొర్లికొండ గ్రామ స్పెషల్ ఆఫీసర్ బ్రాహ్మణపల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి కుమార్,మండల కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు ఉత్కం శ్రీనివాస్ గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ బొజ్జ సంజీవ్ గౌడ్,ఈర్ల భూమేష్,కుడాల వినోద్, సాయిరెడ్డి,నల్లా గంగారెడ్డి తదితరులు అభినందించారు.




11వ రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన తొర్లికొండ గ్రామ క్రీడాకారులు..